కథానిక

# దుర్బలుడి వాగ్దానం

పి. సరళాదేవి

"మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" —'నిన్ను' అనాలో 'మిమ్మల్ని' అనాలోనని గంటసేపటినుంచీ ఆలోచిస్తూ, చివరికి ఇన్నాళ్ళూ 'మీరు' అంటూ ఇప్పుడొక్కసారే 'నిన్ను' అనలేక, అసలా వాక్యమే ఎలాచెప్పడమా అని మథన పడుతూ ఒక్కసారిగా ధైర్యాన్ని కూడదీసుకుని, గుండెలు చిక్కబట్టుకుని, అనేసి, భూదేవికి కళ్ళప్పగించి కదలక మెదలక కూర్చుండి పోయాడు ప్రభాకరం. నుదటిమీది చిరుచెమట తుడుచుకోవడానికన్నా శక్తి లేకపోయింది. అనడమైతే ఎలాగో అనేశాడేగాని చెప్పులే పడతాయో చెఱుకులే పడతాయో ఊహించుకోలేకపోయాడు.

కౌసల్య చటుక్కున అతని మొగం చూసింది. ఆమె కళ్ళల్లో ప్రేమరసాలొలికిపోలేదు, అగ్ని వర్షమూ కురియలేదు. అతని గుండెల లోతుల్ని కొలుస్తున్నట్టుగా చూసింది.

ఆమె దగ్గిరనుంచి ఏ సమాధానమూ రాక పోయేసరికి ధైర్యం కలిగింది. తలెత్తి ఆమె ప్రక్క చూశాడు. నాలుగు కళ్ళూ కలుసుకునే సరికి—ఇద్దరూ మొగాలు తిప్పేశారు.

"ఏమంటారు?"

"ఇష్టమే కాని చదువు పూర్తయేవరకూ చేసుకోను." తన్ను తావలచి వచ్చిన స్త్రీని పురుషుడంగీకరించినంత త్వరగా, తన్ను తా వలచి వచ్చిన పురుషుని స్త్రీ అంగీకరించగలదని అతననుకోలేదు.

"ఒక్కసంవత్సరమేకదా! అలాగే జరగొచ్చు" జేబులోంచి రుమాలు తీసి స్తిమితంగా చెమట తుడుచుకున్నాడు.

ఇద్దరి మధ్యా మౌనం. ఏం మాట్లాడాలో తెలియక వరండామీదినించి క్రిందనున్న పూల మొక్కల్ని చూస్తూ కూర్చున్నారు. ఇక లాభం లేదు. ఎంతసేపు కూర్చున్నా మాట్లాడలేరు.

"వెళ్ళొస్తా" అని లేచాడు. ఆమె లేచి మెట్లవరకూ సాగనంపింది. అక్కడే అలా గోడకు చేరబడి కనిపించేవరకూ అతన్ని చూస్తూ ఆలోచనలో మునిగిపోయింది.

తనకు తానై పెళ్ళి చేసుకుంటానన్నాడు కాబట్టి బహుశా కట్నం ఉండదు. అన్నయ్యకు బరువు తగ్గుతుంది. అమ్మా నాన్నా పోయిన దగ్గిర్నించి ఏలోటూ లేకుండా పెంచాడు. తన పెళ్ళి సమస్యకూడా ఇంత సులువుగా పరిష్కారమయి పోతే వాళ్ళభారం పూర్తిగా తీరిపోయి నిశ్చింతగా ఉంటారు. తన పెళ్ళికి కట్నాలు పోయలేరనేది తనకు తెలుసు. వదిన మంచిది కాబట్టి బి. ఏ. అయినా చదవనిస్తోంది. అన్నయ్య కూడా మనస్ఫూర్తిగా చదివిస్తున్నాడు. ఈ సంవత్సరంతో చదువైపోతే ఏం చెయ్యడమా అని బెంగ పట్టుకుంది, అది పరిష్కారమవబోతోందన్నమాట.

ఆలోచిస్తూ తనగదిలోకెళ్ళి కూర్చుంది. పక్కగదిలోనున్న ఆప్త స్నేహితురాలు జానకి వచ్చి—

"ఏమిటే, అంత తీక్షణంగా ఆలోచిస్తున్నావు?" అని ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చుంది.

"ఈ మధ్య నాకోసం వస్తున్నాడు అతన్ని చూశావు కదూ—అతను నన్ను పెళ్ళి చేసుకుంటాడట."

"ఆఁ ఆఁ రైలులో పరిచయమయాడని ... అదృష్టవంతురాలివి. ప్రేమలో పడ్డారన్నమాట. మరి నీ మొగమేం అలావుంది? ఏమన్నావేమిటి?"

"'ఊఁ' అన్నాననుకో. అయినా నాకా ప్రేమలూ గీమలూ నమ్మకంలేదు. ఎవర్నో ఒకర్ని చేసుకోవాలి, ఇత నయోగ్యుడుగా కనిపించలేదు కాబట్టి 'ఊఁ' అనేశాను."

"బావుందే వేదాంతం! ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాళ్లు సుఖపడలేదంటావా?"

"కథల్లో, కావ్యాల్లో సుఖపడ్డారనుకో ... వాస్తవానికి మటుకు పెళ్ళిచేసుకుని ప్రేమిస్తేనే హాయిఅని."

"నీకేవో పిచ్చినమ్మకాలుంటే వుండనీ కానీ,

ఆ పిచ్చినమ్మకాలతో ఇతన్ని మాత్రం కాదనకు. తరువాత విచారిస్తావు" అని హితోపదేశం చేసింది ఆదర్శ స్నేహితురాలు జానకి.

• • •

కౌసల్య అప్పుడే ప్రభాకరాన్ని సాగనంపి లోపలికి వచ్చింది. గదిలోకొచ్చేసరికి చెల్లాచెదరుగా పడివున్న పుస్తకాలూ బట్టలూ అవీ చూచేసరికి, అన్నింటినీ చుట్టచుట్టి విసిరేద్దామన్నంత కోపమొచ్చింది.

సెలవు రోజంతా వృథాకే గడిచిపోయింది. గదంతా సర్ది చదువుకుందామనుకుంది. చదువు లేదు చట్టు బాధలూ లేవు-రెండుపూటలా హాజరయ్యాడు ప్రభాకరం. ఇంకోరయితే వెంటనే "నే చదువుకోవాలి, వెళ్ళండి." అని చెప్పే సుండేదే! తనను పెళ్ళి చేసుకోబోతున్నాడాయె - కాస్త మర్యాద యివ్వకపోతే బావుండదని, అతనితో మాట్లాడుకుంటూ కూర్చోవలసి వచ్చింది. చదువుకున్నవాడు కదా, ఆ మనిషికైనా తెలియక్కర్లే? మాటిమాటికీ ఇలా వచ్చి కూర్చుంటే ఇంక తన చదువేం సాగుతుంది?

గదంతా చిందులుతొక్కి, అన్నీ కలిపి ఒక మూలకు విసిరేసి మంచంమీద కూలబడింది. ఆ శబ్దం విని పక్కగదిలోనుంచి జానకి వచ్చింది.

"ఏమిటే? కౌ..."

"కౌ—గివ్—అనొద్దని నీకెన్నిమార్లు చెప్పాను? ఈ మాటన్నావంటే పళ్ళూడగొడతాను." కౌసల్య కస్సుమనేసరికి, జానకి జడిసిపోయింది.

"ఎవరిమీదేమిటి, అంత చిర్రుబుర్రు లాడుతున్నావు?" అంటూ మెల్లిగా కౌసల్యపక్క చేరింది జానకి.

"ఎవర్నంటే ఎవరూరుకుంటారు? నన్ను నేనే అనుకోవాలి."

"ఏమిటే? బలే జోరుగా వుంది. కొంపదీసి మా అన్నగారిమీది కోపం కాదుగదా?"

"నోరు ముయ్! వెధవ వరసలూ నువ్వూను..."

"అవునుగాని, ఈమధ్య బలేజోరుగా వస్తున్నాడే! నిన్ను చూడకుండా వుండలేకపోతున్నాడో ఏమో?"

"చస్తున్నాను. మాటిమాటికీ ఇలావచ్చికూర్చుంటూంటే — నాకు పరీక్షల్లో సున్నా తప్పదు."

"పోనీ నన్ను చెప్పమన్నావేమిటి? మీరు వస్తే మా వొదినగారికి పరీక్షల్లో సున్నా వస్తుందిట అని."

"చఫ్!" చెయ్యెత్తేసరికి పరుగెత్తింది జానకి.

ఎంత విసుక్కుని, ఎందరిమీద కోపగించినా తప్పనిపని కాబట్టి, సర్దుకోడానికి వుపక్రమించింది కౌసల్య.

వూళ్ళో వున్నవాడా - తనకెప్పుడు తీరికగా వుంటే అప్పుడంతా వచ్చేస్తాడు. ఎప్పుడంటే అప్పుడంతా ఇద్దరూ అలా మాట్లాడుకుంటూ కూర్చుంటే చూచినవాళ్ళ కెలావుంటుంది? తామిద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నారని అందరికీ తెలిసిపోయిందాయె. వెళ్ళి కూర్చుంటుందే కాని ముందులా మాట్లాడలేక పోతోంది. అతని మొగమూ చూడలేదు-ఎందుకో సిగ్గేస్తుంది. దిక్కులు చూసుకుంటూ కూర్చోవాలి. ఇంకా నయం సినిమాలకు, బీచిలకూ రమ్మనలేదు. అసలింతకూ తనకు గొప్ప అనుమానం! ఈ పెళ్ళి జరుగుతుందా అని? అతనిమీది అపనమ్మకం కాదుకాని, ఆదేమిటో తనకు యీ పెళ్ళి జరుగుతుందనే నమ్మకం మాత్రం లేకపోతోంది. వింటున్నవీ, చూస్తున్నవీ వ్యవహారాలు చూస్తూంటే- ఇలాంటివెన్నో తెగిపోయి ఎవరిదారిన వాళ్లు వెళ్ళిపోయారు. రోమియో జూలియట్లని అందరి దగ్గరా పేరు సంపాదించికూడా, ఆ రోమియో తన జూలియట్‌ని వదిలేసి అమ్మచూపిన పిల్లని కట్నంతోసహా కొట్టుకురాలేదూ? తను ఇంటర్‌లో వుండగా పెళ్ళి చేసుకుంటారనుకున్న నారాయణరావూ శారదా ఏమయ్యారు?

ఏమిటో ఈ ప్రేమలూ, పెళ్ళిళ్ళూను. అసలు పెళ్ళి చేసుకునేవరకూ ఎవర్నీ నమ్మకూడదు.

ప్రభాకరం రాకతో రోజులు తిరుగుతున్నాయి.

ఓరోజు ఎవరో వచ్చారని కౌసల్యకు పిలుపు వచ్చింది. ఇంకెవరు ప్రభాకరమే అయ్యుంటాడనుకుంది. అయితే అది అబద్ధం కాకపోయినా అన్నయ్యకూడా వున్నాడు. ఇద్దర్నీ చూస్తూ, ఎవర్ని ముందు పలకరించాలా అనుకుంటూ అన్నయ్య దగ్గరకు వెళ్ళింది కౌసల్య. ముఖం చిట్లించాడు ప్రభాకరం. అంతలో ప్రభాకరం పక్కకి తిరిగి అన్నయ్యను పరిచయం చేసింది. ప్రభాకరాన్ని పరిచయం చేస్తూ—

"నేను సెలవుల్లో మద్రాసు వెళుతున్నప్పుడు ట్రయినులో సహాయం చేసింది వీరే అన్నయ్యా!" అంది. నమస్కార ప్రతినమస్కారాలయ్యాయి.

ఇద్దర్నీ తన గదిలోకి తీసుకువెళ్ళింది. ఇన్నాళ్ళ నించి పరిచయమున్నా, అంతవరకూ ప్రభాకరాన్ని తన గదిలోకి తీసుకెళ్ళలేదు. వరండాలోనే మాట్లాడి పంపించేసేది. అన్నయ్య రావడం వలన ఆవేళ తప్పనిసరయింది.

• • •

సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్ళినప్పుడు ఎందుకైనా మంచిదని వదినతో చెప్పింది కౌసల్య- వదినకు సాయంగా దొండకాయలు తరుగుతూ.

"అన్నయ్య చూశాడొదినా! ప్రభాకరమని..." ఇంకెలా చెప్పడమో తెలిసిందికాదు. వదిన గ్రహించేసింది.

"ఊఁ చెప్పు మరి."

"ఆయనకిష్టమేనట. అన్నయ్యతో చెప్పమన్నారు." చివరకొచ్చేసరికి మింగేసింది. ఆమె చెప్పే వైఖరిచూచి నవ్వాగక పకపక నవ్వేసింది వదిన. తరుగుతూ తరుగుతూన్న దొండకాయలు అక్కడే పడేసి సిగ్గుతో లోపలికి పరుగెత్తింది కౌసల్య.

సెలవలయిపోయిన తరువాత హాస్టలు కొచ్చేసరికి ప్రభాకరం ప్రత్యక్షం. ఈసారి ఆమె గదిలోకే వచ్చేశాడు. ఆరోజు అన్నయ్యతోపాటు ఎప్పుడయితే తనగదిలోకి తీసుకువెళ్ళిందో అదిమొదలు- ఆమెకు కబురుపెట్టకుండా అతనే గదిలోకి వచ్చేస్తాడు.

ఆదివారం బద్ధకం తీరేవరకూ పక్కమీద దొర్లి అప్పుడేలేచి తలంటు స్నానంచేసి వచ్చింది కౌసల్య. అందరూ ఎవరి పనుల్లో వారున్నారు. ఆమెకేమీ తోచక కిటికీలో కూర్చుని చూస్తోంది. ప్రభాకరం నేరుగా ఆమె గదిలోకి వచ్చేశాడు. ఆమె గమనించలేదు.

అలల మాదిరిగా ఎగిరెగిరి పడుతూన్న నల్లని వెంట్రుకల మధ్య ప్రశాంతంగాఉన్న వదనం. నల్లని కనుబొమలూ, ఎర్రని పెదవులూ, ఆ తెల్లని వదనానికి మెరుగులు. ఒకకాలు కిటికీమీద పెట్టి దానికి చేతులు పెనవేసింది. రెండవకాలు కిటికీ కిందుగా ఇటూఅటూ వూగిస్తూ కూర్చుంది. చేలి మీదుగావచ్చి భూమిని తాకతోన్న పమిటచెంగు ఆమెకో అలంకారం

ఆమెను చూస్తూ ముందుకీ అడుగువెయ్యలేక పోయాడు, వెనకూ అడుగువెయ్యలేకపోయాడు ప్రభాకరం.

నెమ్మదిగా నడిచివెళ్ళి ఆమె భుజంమీద చేయి వేసి "కౌసల్యా!" అన్నాడు చనువుగా ఆమె మొగంలోకి చూస్తూ. త్రుళ్ళిపడి గంతేసింది కౌసల్య. అతన్ని చూచి సిగ్గుపడి, చటుక్కున సర్దుకుని "కూర్చోండి" అంది.

"నేనొకటడుగుతాను ఇస్తావా?" ఆమె కళ్ళల్లోకి చూస్తూ అడిగాడు. ప్రశ్నార్థకంగా చూసిందామె.

"ముద్దు!"-ఇంకొకసారి ఉలిక్కిపడింది. అతను చేయివేసిన భుజంమీద ఏదో గొలుకుతూన్నట్టుంది. కళ్లు తీవ్రంగా మారిపోయాయి. ఒకవిధమయిన అసహ్యం ఆమె కళ్ళల్లో పొడసూపింది.

"మనకింకా బాంధవ్యాలు కలవలేదనే సంగతి మరచిపోయినట్టున్నారు." వణకుతూన్న పెదవులతో అనేసి చర్రున గదిలోంచి వెళ్ళిపోయింది.

అతను వెళ్ళిపోయేవరకూ రాలేదు. అతనిమీద కోపం అసహ్యం అన్నీ కలిగాయి. ఆ తరువాత వారంరోజులకు ఆమెకు లేఖ వచ్చింది.

"కౌసల్యా..."

నాకు ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోతూ చెప్పడానికి ఆవేళ వచ్చాను. ఆరోజు నీ నిర్మలవదనం చూసేసరికి ఎందుకో అడగాలనిపించింది. అడిగాను. దానికి నీకు చాలకోపం వచ్చింది. నన్ను నీచుడిగ భావించావేమో? కాని అడిగినందుకు ఆ తరువాత చాలా విచారించాను. క్షమించు. సంతోంగా నీ దగ్గర వీడ్కోలు తీసుకోలేని దురదృష్టవంతుణ్ని. జవాబు వ్రాయలేకపోతే నేను మరింత బాధపడవలసి వస్తుంది. నీ జవాబుకోసం ఆశతో ఎదురు చూస్తుంటాను.—నీ ప్రభాకరం."

అంతా చదివి ఒక్క నిట్టూర్పు విడిచింది కౌసల్య. అవమానాలన్నీ ఆడవాళ్లు అవలీలగా తీసుకోవాలా? అని ఒక్కక్షణం ఆమె మనసులో మెదిలింది. మళ్ళీ ఏమనుకుందో వెంటనేలేచి అతనికి జవాబు వ్రాసింది.

రోజులు దొర్లిపోతున్నట్టే వాళ్ళ లేఖల్లో ప్రేమ భావాలు, ప్రణయతత్వాలు దొర్లిపోతున్నాయి.

బి. ఏ. పరీక్షలయిపోయాయి. అన్నగారింటికి వెళ్ళిపోయింది కౌసల్య. ఒకరోజు ప్రభాకరం దగ్గర్నించి లేఖ వచ్చింది. "మీరు ఏర్పాట్లన్నీ చేసుకుని ముహూర్తం పెట్టించి లేఖవ్రాస్తే వస్తా"నని.

అది చూచి వీళ్ళు ఖర్చులు తేలిగ్గా తేలిపోయేలా ఏర్పాట్లుచేసి ప్రభాకరానికి తెలియజేశారు.

• • •

తనిలా ఫలానా అమ్మాయిని ఫలానా రోజున పెళ్ళిచేసుకుంటున్నట్టుగా నాన్నకి టెలిగ్రాం ఇచ్చేశాడు ప్రభాకరం. ఇంతకుముందే ఈ విషయమై తండ్రికీ, కొడుక్కీ వాగ్యుద్ధం జరిగింది.

రాత్రి మెయిలుకి వాల్తేరు వెళ్ళాలి-అక్కడనించి మళ్ళాబస్సులో ప్రయాణం. వెళ్ళిన మర్నాడే పెళ్ళి. ఆ రోజు సెలవు పెట్టి బజారులో ఏవేవో కొనుక్కుని హుషారుగా రూము కొచ్చేసరికి టెలిగ్రాం ప్యూన్ ఎదురయాడు.

టెలిగ్రాం చదివి ఆలోచిస్తూవుండిపోయాడు. పెళ్ళి ఆపడానికిదేమన్నా కుట్రకాదుగదా? లేకపోతే ఇప్పటికిప్పుడు నాన్నకి సీరియస్ జబ్బు ఎలా వచ్చేస్తుంది? అయినా చెప్పలేంలే. అసలే ఎప్పుడూ దేనితోనో ఒక దానితో బాధ పడుతూంటారు. ఏమో, ఏమన్నా తిరగబెట్టిందేమో? అమ్మొకతే ఇంకో సాయం లేకుండా ఎలా చేస్తుందో ఏమో?

పితృప్రేమ తొందరచేసింది. అన్నీ త్వరగా సర్దేసి, ఉత్తరానికి పోవలసింది దక్షిణానికి ప్రయాణమయ్యాడు. ముహూర్త సమయానికి అక్కడికి చేరుకోలేనా అనే ధైర్యంతో.

లోపలికి అడుగుపెట్టగానే మంచంమీద బోర్లపడుకుని రాగాలు పెడుతున్న తండ్రి కనిపించాడు. తెలిసిపోయింది ప్రభాకరానికి. చూసీ చూడనట్టు లోపలికి వెళ్ళిపోయాడు. వంటింట్లో గోడకు జారబడి శూన్యంలోకి చూస్తోంది తల్లి. ఇతనొచ్చిన శబ్దం విని కూడా తల తిప్పలేదు. కదలలేదు.

బావుంది వ్యవహారం. శుభమా అని పెళ్ళి చేసుకోబోతూంటే - ఏడుపులూ, పెడబొబ్బలూ- అనుకున్నాడు. కొంతసేపు అటూ ఇటూ తిరిగాడు.

ఎవరూ మాట్లాడలేదు. తండ్రి రాగాలు మాత్రం పెద్దగా విన్పిస్తున్నాయి.

అమ్మపక్కని కూర్చున్నాడు. ఎలా మాట్లాడించాలో తెలియలేదు. "ఎందుకమ్మా? నాన్నలా ఏడుస్తున్నాడు?"

"ఇంకెందుకు నువ్వు చేస్తున్న ఘన కార్యానికే!?' మొగం ఒక్కసారి విస్ఫురింది.

"ఏంచేశా..."మాట పూర్తికాలేదు.

"ఎక్కడో ఓ అడవిలో ఓ పిల్ల కన్పించింది పెళ్ళి చేసుకుంటానంటే ... ఏమిటి? ఇక మంచి, చెడ్డా, 'అమ్మా నాన్న అక్కర్లేదూ? ఇప్పుడు కాదులే ... అమ్మగారు పడకేసి, అయ్యగారు చెయ్యి కాల్చుకుంటే అప్పుడు జ్ఞాపక మొస్తుంది. అ...మ్మ. ఇదేం ఖర్మో? బుద్ధి బూరెలు తినమంటూంటే, రాత రాళ్ళు మొస్తానందట."

అంతలో బయట ఏదో గలాబా వినిపించింది. వచ్చి చూస్తే, తండ్రి ఏడుపు విని ఆ వీధిలో వాళ్ళంతా మూగిపోయారు. గదిలోకి వెళ్ళి తలుపులు వేసుకున్నాడు ప్రభాకరం. వద్దనుకున్నా నాన్న గొంతు పెద్దగా విన్పిస్తోంది.

"ఈ పెళ్ళి చేసుకున్నాడా వాడికి నా ఆస్తిలో దమ్మిడీవక్కడు. నాకు ఒక్కడే కొడుకనుకుంటాను. లేదు చచ్చాడనుకుంటాను. ఆ చిన్నాడే ఎప్పటికయినా నా కింత గంజి పోస్తాడు. చిన్నప్పటినించీ పెంచి ఇంత వాడిని చేస్తే - ఇప్పుడు చేసే ఘన కార్యమిది. లోకాన్నుద్ధరించేస్తాడు. బయలుదేరాడు సంస్కర్త. పెళ్ళి జరిగిన సమయానికే చిన్నాడి పేర ఆస్తంతా రాసేస్తాను. లక్షరూపాయలంటే ఏమనుకున్నాడో... రెండు లక్షలూ చిన్నాడికి వెళ్తాయి. పోనీ సుఖపడతాడు. వీడూ చేస్తాడు ఓ గంపెడు పిల్లలు తయారయితే తెలిస్తోంది. హు. సంసారం చెయ్యడమంటే షికార్లు కొట్టడమనుకున్నాడు కాబోలు."

ప్రభాకరాని కేం తోచలేదు. రివ్వున బయటికెళ్ళిపోయాడు. దారిలో కనిపించిన ప్రతి మనిషీ అడగడమే "ఏం వోయ్! మీ నాన్న కిష్టంలేని పెళ్ళి చేసుకుంటున్నావట" అని. కొందరు చెయ్యి పట్టుకుని లాక్కెళ్ళి నీతిబోధ చెయ్యడం మొదలు పెట్టారు.'ఇదెక్కడిగొడవరాబాబూ'అనుకున్నాడు

(తరువాయి 48-వ పేజీలో)

20-7-56



ముగింపు కొచ్చాయి. ఈ చిత్రాన్ని ద్వారా ఈమె అఖిల భారతంలో సైతం పేర్గాంచ్చు...

★ పృథ్వీరాజ్ కపూర్, తన పృథ్వీ థియేటర్స్ ద్వారా పేరొందిన నాటకం 'పైసా'ని స్వయంగా చిత్రీకరించడానికి నిశ్చయించాడు. దీనిలో ఆ నాటకంలో పాల్గొనే వారంతా వుంటారట...

★ తమిళంలో బాగా డబ్బు కొన్న 'గులేబకావళి'ని, తన్నిర్మాతలు ఆర్.ఆర్. ఫిర్మ్స (మదరాసు) వారు హిందీలోనూ తయారుచేసి విడుదల చేశారు. అది ఇప్పుడు ఉత్తర హిందూస్థానంలో సైతం బాక్సాఫీస్ హిట్టయిందని పత్రికలు వ్రాస్తున్నాయి. ఇందులో టి. ఆర్. రాజకుమారి, రాజసులోచన, జి. వరలక్ష్మి, రామచందర్, చంద్రబాబు, తంగవేలు ప్రభృతులు నటించారు. రామన్న దర్శకుడు...

★ మదరాసులో మరో తెలుగు ఫిలింకంపెనీ పని ప్రారంభించింది. దీని పేరు శివకుమారీ పిక్చర్స్. వీరు నిర్మిస్తున్న చిత్రం పేరు 'తానొకటి తలస్తే..' దీనికథా, దర్శకత్వం: అడ్డాల నారాయణరావు; డైలాగ్స్: రామ్‌చంద్, ప్రభాకర్; పాటలు: దైతా గోపాలం; సంగీతం: అశ్వత్థామ; కెమేరా: నాగేశ్వరరావు; శ్యామలా స్టూడియోలో మొదటి సెట్టు వేశారు...ఇందులో-నాగయ్య, లింగమూర్తి జగ్గయ్య, ముక్కామల, డా॥ శివరామకృష్ణయ్య, రాజారెడ్డి, నల్లరామమూర్తి, గిరిజ, అన్నపూర్ణ రాజసులోచన, పాల్గొంటున్నారు.

★ వినోదావారు తమ నూతన చిత్రం 'చిరంజీవులు' అవుట్‌డోర్ షూటింగ్ కని ఈ వారంలో కొండపల్లి వెళ్ళారు. ఆ ప్రకృతి దృశ్యాలు మనోరంజకంగా ప్రదర్శించి, తదితర నిర్మాతలను పురికొల్పి, మిగతా ఆంధ్రప్రకృతి సంపదనూ తెరకెక్కించిన వారు కాగలిగితే వినోదావారు ధన్యులే!...

★ బి. ఎన్. రెడ్డిగారి 'బంగారు పాప' త్వరలో హిందీలో నిర్మించే ఆలోచనలు జరుగుతున్నవి...

---

(44-వ పేజీ తరువాయి)

ఇంటి కొచ్చేసరికి మేనమామ కనిపించాడు. "నీతో మాట్లాడాలి ఇలారా" అని గదిలోకి తీసుకుపోయాడు. ప్రభాకరాని కంతా గందరగోళంగా వుంది.

"నువ్వు ఆ పిల్లను పెళ్ళిచేసుకోడం తప్పనీ అనను, వద్దనీ అనను. నీ కిష్టంవుంటే చేసుకో, కాని అమ్మా నాన్నకి ఇష్టంలేదు. పెళ్ళి చేసుకున్నావా వీళ్ళవల్లేమీ ఆశించకు—అసలు తలంచకు. నాన్న ముందే చెప్పేశాడు. ఆస్తిమీద ఆశలు పెంచుకోకు. నీ స్వశక్తిమీద ఆధారపడు. వీళ్ళతో సంబంధాలు వదిలేసి నీమట్టుకు నువ్వుండు. లేదూ... వీళ్ళ ఆస్తీ, బాంధవ్యం కావాలంటే వాళ్ళు చూపించిన పిల్లను చేసుకో" అనేసి వెళ్ళిపోయాడు మేనమామ. ప్రభాకరం వూగిపోయాడు. లక్ష!లక్ష రూపాయల ఆస్తిని వదులుకోవాలి. ఇంకొక ప్రక్క—కౌసల్య. ఆ రోజు కిటికీలో కూర్చున్న కౌసల్య సౌందర్యం. డబ్బు లేకపోతే బ్రతకలేము.సౌందర్యం లేకపోతే?—

ఆరోజు ముద్దు అడిగి కౌసల్యలో అపనమ్మకం, అసహ్యం కలిగించాడు. ఇప్పుడు మరీ ఏహ్యభావం వస్తుంది. మోసకారుడిగా, నీచుడిగా ఆమె హృదయంలో స్థిరుడైపోతాడు. అబ్బ! ఆ సుకుమార హృదయంలో కసి పేరుకు పోదూ? మళ్ళీ ఆమె మొగం తను చూడగలడా? ఇన్నాళ్లూ ఆశలు పెంచుకుని, ఆమెలో పెంచి ఇప్పుడు కాల్చేసుడమేనా?

అబ్బ! డబ్బు! డబ్బు లేకపోతే లోకంలో గౌరవమేదీ? డబ్బు లేకపోతే జీవితావసరాలు తీరేదెలా? బతకడమెలా? అన్నీ అనుభవించడమెలా?

కౌసల్యే సౌందర్యం, సౌందర్యమే కౌసల్య—అనుకున్న కౌసల్యను వదిలివేయడమేనా?

చిన్నప్పటినుంచీ పెరిగి అమ్మా నాన్నని వదిలిపెట్టగలడా? పెద్దకొడుకుగా, వంశోద్ధారకుడుగా, ముసలితనంలో పోషిస్తాడనే ఆశతో పెంచి పెద్ద చేసిన అమ్మా నాన్నకి ద్రోహంచేసి, హృదయంలో చిచ్చుపెట్టి వెళ్ళిపోవడమేనా?

అతను వూగివూగి ఆగిపోయాడు. పోస్టాఫీసుకి వెళ్ళి టెలిగ్రాం ఇచ్చేశాడు—ప్రస్తుతానికి వివాహం వాయిదా వెయ్యమని. మరునాడే కౌసల్య అన్నగారి దగ్గర్నించి టెలిగ్రాం అందుకున్నాడు- "పురుషత్వంలేని నీలాంటివాడికి నా చెల్లెల్నివ్వలేను" అని.